తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
26-09-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 228
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /-

తెలుగు దినపత్రిక
సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575




# బోధన బందీ.. బలవుతున్న ప్రాణాలు!

## స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లోనే టీచర్ ఆత్మహత్యాయత్నం

- జీవో 25 తెచ్చిన శాపం..
- నిద్రమాత్రలు మింగిన చిల్వకోడూరు ఎస్జీటీ
- పనిభారం, అధికారుల వేధింపులతోనే అంటూ ఉపాధ్యాయుల ఆందోళన
- 12 వేలకు పైగా పాఠశాలల్లో ఒక్కరిద్దరు టీచర్లతోనే సర్కస్
- ఒకే గదిలో 1 నుంచి 5 తరగతులు
- ఒకే సమయంలో ఐదు క్లాసుల బోధన
- చాక్‌పీస్ పట్టాల్సిన చేతులతో ఆన్‌లైన్ యాప్‌లు, ఫొటోలు, వీడియోలు కుస్తీ
- స్పర్శ్ పోర్టల్ చిక్కులు..
- సుద్దముక్క కొనాలన్నా మొబైల్ లో గంటల తరబడి తంటాలు
- రెండేళ్లలో పని ఒత్తిడి, గుండెపోట్లతో 12 మంది ఎస్జీటీల మృత్యువాత

**(తెలంగాణ బ్యూరో - సిరి న్యూస్ ):** విద్యావ్యవస్థకు పునాది రాయి వేయాల్సిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి జీవితం నేడు తీవ్ర మానసిక క్షోభకు, చావుబతుకుల పోరాటానికి వేదికగా మారింది. క్షేత్రస్థాయిలో పనిభారం, ఉన్నతాధికారుల మితిమీరిన వేధింపులు ఏ స్థాయికి చేరాయో చెప్పేందుకు చిల్వకోడూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి ఘటనే నిదర్శనం. మండల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సాగుతుండగానే ఆ ఉపాధ్యాయుడు తీవ్ర మనస్తాపానికి గురై నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది. సమావేశంలోనే తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోవడంతో సహచర ఉపాధ్యాయులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఉపాధ్యాయుడిని గుమస్తాగా, డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా మార్చి ప్రాణాలు తీసే స్థాయికి నెట్టిన ప్రభుత్వ అనాలోచిత విధానాలపై విద్యా లోకం భగ్గుమంటోంది.

**12 వేల పాఠశాలల్లో ఒక్కరిద్దరితోనే సర్కస్..**

గతంలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే పద్ధతి అమల్లో ఉండేది. కానీ 2022లో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 25 ప్రాథమిక విద్యకు పెను శాపంగా మారింది. విద్యార్థుల సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని ఉపాధ్యాయులను కుదించడంతో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. 060 మంది విద్యార్థులుంటే కేవలం ఇద్దరు టీచర్లు. ఒక టీచర్ మూడు తరగతులు, మరొకరు రెండు తరగతులు చెప్పడంతో పాటు హెచ్‌ఎం బాధ్యతలు, మధ్యాహ్న భోజనం చూసుకోవాలి. 2030 మంది విద్యార్థులుంటే ఒకే ఒక్క టీచర్. ఆ ఒక్క ఉపాధ్యాయుడే ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులు బోధించాలి,

మిగతా 2వ పేజీలో..

# గంగమ్మను చేరిన మహా గణపతి

- మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం పూర్తి
- భారీగా తరలివచ్చిన భక్తులు
- భారీ భద్రత నడుమ ప్రశాంతంగా సాగిన ఉత్సవం
- జై గణేశ నినాదాలతో మార్మోగిన ట్యాంక్‌బండ్

ఖైరతాబాద్‌లో కొలువై నవరాత్రులు పూజలందుకున్న పంచముఖ సంకట హర మహా గణపతి శుక్రవారం మధ్యాహ్నం భక్తుల కోలాహలం నడుమ, జై గణేశ నినాదాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నారు.

2



## బాలాపూర్ లడ్డూ 39 లక్షలు

3

# మోటార్లు నడిపి జలాశయాలు నింపాలి



- నీళ్లు లేక సిద్దిపేటలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నడవని పరిస్థితి
- గోదావరిలో వరద పోతుంటే బురద రాజకీయాలా?
- రైతుల ఆవేదన కనిపించడం లేదా
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ఒకవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో మీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోందంటూ మాజీ మంత్రి హరీశ్రావు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డికి లేఖ రాశారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే మీరు మాత్రం ప్రాజెక్టుల మీద రాజకీయాలు చేస్తూ, గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే,

మిగతా 3వ పేజీలో..

# విచారణకు హాజరు కండి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి ఈడీ సమన్లు
- సాహితి ఇన్‌ఫ్రాటెక్ మనీ లాండరింగ్ కేసులో..

2



# పెన్షన్‌కు లంచం డిమాండ్

- ఎస్సీ అభివృద్ధి శాఖ సిబ్బంది ముగ్గురు సస్పెన్షన్
- బాధితురాలి ఫిర్యాదుతో విచారణ జరిపించిన కలెక్టర్ పవార్

2



# గురుకుల విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- 14 మందికి గాయాలు.. ఆలస్యంగా వెలుగులోకి
- హాస్టల్ కు చేరుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి
- లోపలికి వెళ్ళకుండా అడ్డుకున్న పోలీసులు, సిబ్బంది
- హాస్టల్ ఎదుట ధర్నాకు దిగిన దయాకర్ రావు

**పాలకుర్తి, సిరి న్యూస్ , సెప్టెంబర్ 25 :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రం లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలుకలు కరవడంతో పలువురికి గాయాలయ్యాయి. బాధితులను ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించినట్లు

మిగతా 2వ పేజీలో..

# రాహుల్ వైద్య పరీక్షలు చేయించుకోవాలి



- ప్రధాని, హోంమంత్రిపై వ్యాఖ్యలు దురదృష్టకరం
- ఫిరాయింపులు ప్రోత్సహిస్తూ ఓట్ చోరీ అనడం ద్వంద్వ వైఖరి
- రాజ్యాంగబద్ధ సంస్థలు, బలగాలపై నమ్మకం లేకపోవడం సిగ్గుచేటు

3



# అక్టోబర్ 25 నుంచి 'హ్యామ్' రహదారుల పనులు

- గ్రామీణ తెలంగాణకు శాశ్వత మౌలిక వసతులే లక్ష్యం
- తొలి విడత రూ.6 వేల కోట్లతో 7,448 కి.మీ మేర రోడ్లు
- ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికి తొలి ప్రాధాన్యం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

3

# జ్ఞానేష్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలు

7

- బీహార్‌లో కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం
- అస్సాంలో గౌరవ్ గొగోయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పాట్నాలో కాంగ్రెస్ కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం



# సీఎం రేవంత్ కు ముహమ్మద్ అవార్డు ప్రదానం

**తిరువనంతపురం, సెప్టెంబర్ 25:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక ‘ఆర్యదాన్ ముహమ్మద్2026’ అవార్డును స్వీకరించారు. కేరళం రాష్ట్రంలోని నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆర్యదాన్ ముహమ్మద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు కేరళ వెలుపల నుంచి ఎంపికైన తొలి వ్యక్తిని కావడం మరింత గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. “నేను కేరళం వచ్చిన ప్రతిసారీ ఎంతో ఆత్మీయ స్వాగతం లభించింది. రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగిన భారత్ జోడో యాత్ర కోసం ఇక్కడికి వచ్చాను. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఇక్కడికి వచ్చాను. కేరళం నాకు ఎంతో ఆత్మీయమైనది. కేరళం ప్రజలు లౌకికవాదానికి కట్టుబడి ఉన్నందుకు కృతజ్ఞతలు” అని పేర్కొన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ ఒక గొప్ప రాజకీయ నాయకుడు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. పలువురు ముఖ్యమంత్రుల వద్ద నాలుగుసార్లు మంత్రిగా పనిచేశారు. కేరళం రాజకీయాల్లో ఆయన ఒక చాణక్యుడిలా ఉండేవారు అని అన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ నిలంబూర్‌లోనూ, కేరళంలోనూ కాంగ్రెస్ పార్టీకి ఒక మహావృక్షంలా ఉండేవారని గుర్తుచేశారు. ఆయన తన జీవితమంతా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడారని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆర్యదాన్ స్ఫూర్తితో మనమంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్యదాన్ షౌకత్, కేరళం మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బోధన బందీ.. బలవుతున్న ప్రాణాలు!

**మొదటిపేజీ తరువాయి**

మధ్యాహ్న భోజన రికార్డులు రాయాలి, ఆన్‌లైన్ డేటా ఎంట్రీలు చేయాలి. 12వేలకు పైగా పాఠశాలల్లో ఇదే దుస్థితి. రాష్ట్రంలో దాదాపు 60 శాతానికి పైగా ఉన్న ప్రాథమిక బడుల్లో ఒకరు లేదా ఇద్దరు టీచర్లతోనే బహుళ తరగతుల సర్కస్ సాగుతోంది. ఒక క్లాసుకు పాఠం చెబుతుంటే మిగతా నాలుగు తరగతుల పిల్లలు గాలికి వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనివల్ల ప్రభుత్వ బడుల్లో నాణ్యత దిగజారి, తల్లిదండ్రులు ప్రైవేట్ బాట పట్టడంతో ఇప్పటికే 15 శాతం ఎన్‌రోల్‌మెంట్ పడిపోయింది.



**ఎఫ్ఎల్ఎన్, స్పర్శ్ యాప్‌ల ఉచ్చు..**

పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం లక్ష్యం మంచిదే అయినా దాని అమలు విధానం ఉపాధ్యాయుల పాలిట ఉచ్చుగా మారింది. ప్రతి విద్యార్థికి రోజూ ఐదు యాక్టివిటీలు చేయించాలి, వాటికి ఫొటోలు, వీడియోలు తీసి ఎప్పటికప్పుడు యాప్‌లలో అప్‌లోడ్ చేయాలి. కనీస సెల్‌ఫోన్ సిగ్నల్స్, ఇంటర్నెట్ లేని ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లోనూ ఇదే ఆంక్షలు విధించడంతో ఉపాధ్యాయుల సమయమంతా మొబైళ్లతో కుస్తీ పడటానికే సరిపోతోంది. దీనికి తోడు కొత్తగా ప్రవేశపెట్టిన స్పర్శ్ ఫైనాన్షియల్ పోర్టల్ ఎస్జీటీలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. స్కూల్‌కు ఒక సుద్దముక్క డబ్బా, చీపురు కొనాలన్నా వెండార్ల నమోదు, డిజిటల్ కీలు, బిల్లుల అప్‌లోడ్ల కోసం రోజంతా సెల్‌ఫోన్ల ముందే సమయం వృధా అవుతోంది. బోధనను వదిలేసి గుమస్తాగిరి చేయలేక ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనకు లోనవుతున్నారు.

**తనిఖీల పేరిట వేధింపులు.. రెండేళ్లలో 12 మంది బలి**

బడికి సరైన సదుపాయాలు, అవసరమైన సిబ్బందిని కేటాయించని విద్యాశాఖ ఉన్నతాధికారులు.. తనిఖీల పేరిట నిరంతరం ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు. తరగతి గదిలో చదువు ఎలా సాగుతుందో చూడకుండా రిజిస్టర్లు నిండాయా, యాప్‌లలో ఫొటోలు పెట్టారా, హాజరు వేశారా, హరిత హారం మొక్కలు బతికాయా అంటూ హుకుం జారీ చేస్తున్నారు. పిల్లాడికి చదవడం ఎందుకు రాలేదు? అని నిలదీసే అధికారులు.. ఆ పిల్లాడికి పాఠం చెప్పడానికి ఉపాధ్యాయుడికి లభించిన నికర సమయం ఎంతన్న ఇంగితాన్ని విస్మరిస్తున్నారు. ఈ నిరంతర ఒత్తిడి, మానసిక ఆందోళనలతో ఎస్జీటీలు బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. గత రెండేళ్ల కాలంలోనే తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 12 మంది ఎస్జీటీలు విధి నిర్వహణలోని ఒత్తిడి తట్టుకోలేక గుండెపోట్లతో మరణించారంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**డీఏలు జీతాల సమస్య.. ఇది ప్రాణాల సమస్య**

ఉద్యోగ సంఘాల నేతలు రెండు డీఏలు రాగానే ప్రభుత్వ పెద్దలకు శాలువాలు కప్పి అభినందనలు తెలుపుతుంటే.. క్షేత్రస్థాయిలో ఎస్జీటీలు మాత్రం మా ప్రాణాలు కాపాడండి అంటూ ప్లకార్డులు పట్టుకుని వేడుకోవాల్సిన దుస్థితి దాపురించింది. డీఏలు, పీఆర్సీలు కేవలం జీతాలకు సంబంధించినవైతే.. ఎస్జీటీల సమస్య నేరుగా ప్రాణాలకు, ప్రభుత్వ పాఠశాలల మనుగడకు సంబంధించినది. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. ప్రాథమిక విద్యను నాశనం చేస్తున్న జీవో 25ను వెంటనే సస్పెండ్ చేసి, క్షేత్రస్థాయి వాస్తవాలపై సమగ్ర అధ్యయనం చేయాలి. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి నాన్ టీచింగ్, అకౌంటింగ్ పనులకు క్లస్టర్ స్థాయిలో ప్రత్యేక సిబ్బందిని నియమించాలి. రోజూ ఫొటోలు, వీడియోలు అడిగే ఎఫ్ఎల్ఎన్ యాప్ నిబంధనలను వారానికి ఒకసారికి కుదించాలి. అధికారుల వేధింపులను అరికట్టడంతో పాటు పని ఒత్తిడితో కుంగిపోతున్న ఉపాధ్యాయులకు మానసిక స్థైర్యాన్నిచ్చేందుకు ప్రతి మండలానికి ఒక కౌన్సెలర్‌ను తక్షణమే నియమించాలి.

# పెన్షన్‌కు లంచం డిమాండ్

**సూర్యాపేట, సిరి న్యూస్ , సెప్టెంబర్ 25:**

పదవీ విరమణ పొందిన తోటి ఉద్యోగిణి పింఛను ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు లంచం డిమాండ్ చేసిన ముగ్గురు ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కొరడా ఝుళిపించారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నారు.షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) అభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగి గత మార్చి లో పదవీ విరమణ పొందారు. అయితే ఆమెకు రావాల్సిన పింఛను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తాలూకు ఫైలును (పెన్షన్ ప్రపోజల్) ఎప్పటికప్పుడు పై కార్యాలయానికి పంపించాల్సి ఉండగా గతంలో పనిచేసిన అధికారిణితో పాటు సంబంధిత విభాగ ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారు. ఆ శాఖకు చెందిన గతంలో పనిచేసిన సీనియర్ అధికారిణితోపాటు సీనియర్ అసిస్టెంట్ జి.రవివర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.యాదగిరి, అటెండర్ బి.రాము బాధితురాలి నుంచి పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు.

అడిగిన మొత్తం ఇస్తేనే ఫైలుపై సంతకాలు చేసి ముందుకు పంపుతామని చెప్పడంతో ఆ మొత్తం ఇచ్చేందుకు బాధితురాలు నిరాకరించడంతో నెలలతరబడి ఫైల్ కదలకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వీసు ముగిసి నెలలు గడుస్తున్నా లంచం ఇవ్వలేదనే సాకుతో తన పెన్షన్ ఫైలును కదలకుండా అడ్డుకుంటున్నారని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**బాధితురాలి ఆవేదనపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్**

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారులు జరిపిన విచారణలో ఉద్యోగులు లంచం డిమాండ్ చేసిన మాట వాస్తవమేనని, విధుల్లో తీవ్ర అలసత్వం, బాధ్యతారాహిత్యం ప్రదర్శించారని తేల్చారు. విచారణ నివేదిక ఆధారంగా సీనియర్ అసిస్టెంట్ రవివర్మ, జూనియర్ అసిస్టెంట్ యాదగిరి, అటెండర్ రాములను తక్షణమే సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. దింతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారిణి పై సైతం సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించినా, ప్రజలను లేదా విశ్రాంత ఉద్యోగులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ లంచాల కోసం వేధించినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

# మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ నేడు

- దేశ ఆర్థిక ప్రగతికి మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని వ్యాఖ్య
- తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర చారిత్రాత్మకమన్న పొన్నం

**హైదరాబాద్, సిరి న్యూస్ సెప్టెంబర్ 25:**

మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతిని పురస్కరించుకుని గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేశ నిర్మాణం, ఆర్థిక ప్రగతితోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలతో కొత్త దిశ 1991లో కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలికాయని పొన్నం గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా దేశ అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారన్నారు. ఆయన హయాంలో ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం వంటి కీలక నిర్ణయాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని పొన్నం పేర్కొన్నారు. 2009లో రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు వరకు ఆయన నాయకత్వం కీలకమైందన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం తనకు లభించిందని, ఆయన సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగానని పొన్నం తెలిపారు.

# బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డు ఇచ్చింది లేదు

**సూర్యాపేట, సిరి న్యూస్ ,సెప్టెంబర్ 25:**




పదేళ్లపాటు అధికారంలో ఉన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేసిందని నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆరోపించారు. కొత్త కుటుంబాలు ఏర్పడినా, కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా, అర్హులు దరఖాస్తు చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో 89,95,282 రేషన్ కార్డులు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని చెప్పారు. వీటి ద్వారా మరో 61,09,544 మందికి ఆహార భద్రత కల్పించామన్నారు. పాత, కొత్త కార్డులు కలిపి ప్రస్తుతం రాష్ట్రంలో 1,06,28,092 ఉండగా 3,42,57,109 మంది ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికీ రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేషన్ కార్డు బియ్యం పొందే పత్రం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు వివిధ సంక్షేమ పథకాలకు కీలక ఆధారమని పేర్కొన్నారు. రేషన్ కార్డుదారులందరికీ ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాగా, తన సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌తోపాటు మిర్యాలగూడ నియోజకవర్గంలో మంత్రి రెండు రోజులు పర్యటించనున్నారు. నేరేడుచర్లలో పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు మంత్రి ఉత్తమ్ రేషన్ కార్డులు సోమవారం పంపిణీ చేస్తారు. అనంతరం ముసిఒడ్డు సింగారంరోళ్లవారిగూడెం బీటీ రోడ్డును ప్రారంభిస్తారు. హుజూర్‌నగర్‌లో రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయనున్నారు. మేళ్లచెరువు మండలం కందిబండలో రూ.2.80 కోట్లతో నిర్మించిన వంతెన, కప్పలకుంట తండా, వెల్లటూరు ఆర్అండ్ఆర్ కాలనీ, వేపల మాధవరం గ్రామాల్లో నిర్మించిన వివిధ భవనాలను ప్రారంభిస్తారు. మేళ్లచెరువులో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువపై రూ.3 కోట్లతో నిర్మించిన మూడు వంతెనలను ప్రారంభించి మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. 28న గరిడేపల్లి మండలం కొండాయిగూడెం, రెగ్యులగడ్డ తండాల్లో నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. ఈ రెండు రోజుల పర్యటనలో మొత్తం రూ.8.90 కోట్ల విలువైన రహదారులు, వంతెనలు, గ్రామ పంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్, స్వయం సహాయక సంఘాల భవనాలను మంత్రి ప్రారంభించనున్నారు.మిర్యాలగూడ కార్యక్రమం అనంతరం మంత్రి సూర్యాపేటకు చేరుకుని భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంలో పాల్గొంటారు.

# విచారణకు హాజరు కండి

**హైదరాబాద్, సిరి న్యూస్ , సెప్టెంబర్ 25 :**

సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం సమన్లు జారీ చేసింది. కంపెనీకి చెందిన సుమారు రూ.2.1 కోట్ల నిధులు ఆయన బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించినట్లు గుర్తించడమే ఇందుకు కారణం. సోమవారం తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. ఈ లావాదేవీల గురించి ఆయన్ని ప్రశ్నించడంతో పాటు కంపెనీ నుంచి అందిన డబ్బుకు సంబంధించి వివరణ కోరే అవకాశం ఉంది. ఇళ్ల కొనుగోలుదారుల నుంచి సాహితీ ఇన్‌ఫ్రా సేకరించిన నిధులను దారి మళ్లించారన్న ఆరోపణలపై ఈడీ చేపట్టిన విస్తృత దర్యాప్తులో భాగంగా ఈ సమన్లు జారీ అయ్యాయి. కొనుగోలుదారుల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కంపెనీ, దాని మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ ఇతరులపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్ దర్యాప్తును చేపట్టింది. లక్ష్మీనారాయణను 2024లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఫ్రీ లాంచ్ పేరుతో కొనుగోలుదారుల నుంచి నగదు వసూలు చేసినట్లు, ఈ నిధులను కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లు గాంధీపై ఆరోపణలు ఉన్నాయి.

# గంగమ్మను చేరిన మహా గణపతి

**హైదరాబాద్, సిరి న్యూస్ , సెప్టెంబర్ 25 :**

ఖైరతాబాద్‌లో కొలువై నవరాత్రులు పూజలందుకున్న పంచముఖ సంకట హర మహా గణపతి శుక్రవారం మధ్యాహ్నం భక్తుల కోలాహలం నడుమ, జై గణేశ నినాదాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నారు. ప్రధాన నిమజ్జన ఘట్టం ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల భక్తులతోపాటు పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వరుణుడు కూడా కరుణించాడు. ట్యాంక్‌బండ్‌పై క్రేన్ నంబర్4 దగ్గర గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నిమజ్జనం పూర్తి చేశారు. మహా గణపతి నిమజ్జనాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా శోభాయాత్ర కొనసాగింది. మధ్యాహ్నం 2.15 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను పూర్తి చేశారు. సెక్రటేరియట్ సౌత్ ఈస్ట్ మార్గంలో భక్తులు కిక్కిరిసిపోయారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, అప్పర్ ట్యాంక్ బండ్‌పై అత్యంత కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు కొనసాగుతున్నాయి. జంట నగరాల నుంచి భారీగా విగ్రహాలు తరలివస్తున్నాయి. 12 క్రేన్ల ద్వారా నిమజ్జనం ప్రక్రియ కొనసాగుతోంది. భద్రత కోసం పోలీస్ కంట్రోల్ రూం ద్వారా 58 సీసీటీవీ కెమెరాలతో పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి అయ్యేలా అప్పర్ ట్యాంక్ బండ్‌పై భారీగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి క్రేన్ వద్ద ఒక ఎసఐ, ఐదుగురు పోలీస్ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో రంగంలోకి 25 క్రైమ్ టీమ్స్, 10 షీ టీమ్స్ బృందాలు విధులు నిర్వర్తిస్తున్నాయి



# గురుకుల విద్యార్థినులను కరిచిన ఎలుకలు

**మొదటిపేజీ తరువాయి**

సమాచారం. ఈ ఘటనపై స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు శుక్రవారం గురుకుల పాఠశాల, హాస్టల్ కు చేరుకున్నారు. విద్యార్థినులను పరామర్శించి ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు, పాఠశాల సిబ్బంది అను మతించలేదని ఆయన తెలిపాయ. విద్యార్థినుల పరిస్థితి గురించి తెలుసుకునే వరకు అక్కడి నుంచి వెళ్లేది లేదంటూ హాస్టల్ ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం వార్డెన్, ప్రిన్సిపాల్ తో మాట్లాడిన ఎర్రబెల్లి విద్యార్థినులకు కనీస వసతులు కల్పించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయ ని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య సమస్యలు ఉన్నాయని, గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పాము కరిచిందని ఆయన పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత, కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్ల క్ష్యం చేస్తోందని ఆరోపించారు. 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనపై ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకర మన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల సెక్రటరీ శారదతో ఫోన్లో మాట్లాడి ఘటన వివరా లను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు ఎర్రబెల్లి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చినట్లు చెప్పారు. కనీస వసతుల కల్పన పై ప్రభుత్వం దృష్టి సారించాలని, విద్యార్థి నుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. గతంలో తాను మంత్రిగా ఉన్నపుడు విద్యార్థుల సౌకర్యాల పై పర్యవేక్షించామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

**బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా**

ఎలుకల దాడిలో విద్యార్థినులు గాయపడడంతో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో పాఠశాల గేటు ముందు ధర్నా నిర్వహించారు. విద్యార్థినీలకు మెరుగైన వైద్య సేవలు అందించలన్నారు. పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు పాకనాటి దేవేందర్ రెడ్డి, దొంగరి మ హేందర్, మండల అధ్యక్షులు మారం రవికుమార్, ప్రధాన కార్యదర్శులు వేల్పుల దేవరాజు, పెనుగొండ సోమేశ్వర్, నాయకులు ఈర్ల రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

**తహసిల్దార్, ఎంపీడీవోలకు బీఆర్ఎస్ వినతి పత్రం**

పాఠశాలలో జరిగిన సంఘటనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఇన్చార్జి అనంతుల ఆంజనేయులు ఆధ్వర్యంలో తహసిల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల నిర్వహణలో గత పాలకుల తరహాలోనే నేటి పాలకులు అవలంబిస్తున్నారని విమర్శించారు. బాలికలకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి తల్లిదండ్రులకు చూపాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మూల ప్రభాకర్ గౌడ్, పొన్నం యాకయ్య గౌడ్, నాయకులు అంబోజు సంతోష్, అనిత, పూలమ్మ, కొమురయ్య, సోమ నరసయ్య పాల్గొన్నారు.

# అక్టోబర్ 25 నుంచి 'హ్యామ్' రహదారుల పనులు

**హనుమకొండ, సిరి న్యూస్ , సెప్టెంబర్ 25:**

గ్రామీణ తెలంగాణకు మెరుగైన, నాణ్యమైన రహదారి సౌకర్యాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ విధానంలో చేపట్టనున్న రహదారుల నిర్మాణ పనులను అక్టోబర్ 25 నుంచి ప్రారంభించాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రాంతీయ అధికారులతోపాటు కాంట్రాక్టర్లతో మంత్రి శుక్రవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో మొత్తం 18,472 కి.మీ మేర గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. తొలి విడతలో మూడు వేల గ్రామ పంచాయతీల పరిధిలో రూ.6 వేల కోట్లకు పైగా వ్యయంతో 7,448 కి.మీ (2,145 రహదారులు) మేర పనులు చేపట్టనున్నామన్నారు. వీటిని 17 సర్కిళ్లు, 17 ప్యాకేజీలుగా విభజించినట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రూ. 1,130 కోట్లతో 1,366 కి.మీ మేర 445 రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఉన్న రోడ్ల అభివృద్ధితోపాటు 10 శాతం కొత్త రహదారులను నిర్మిస్తామన్నారు.

**15 ఏళ్లపాటు నాణ్యతకు బాధ్యత**

హ్యామ్ విధానం ద్వారా రహదారుల నాణ్యతకు, నిర్వహణకు పెద్ద పీట వేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ప్రాజెక్టు పూర్తయిన వెంటనే 40 శాతం నిధులు చెల్లించి మిగిలిన 60 శాతం నిధులను 15 ఏళ్ల పాటు విడతల వారీగా చెల్లిస్తామన్నారు. దీనివల్ల 15 ఏళ్ల పాటు రోడ్ల నిర్వహణ, నాణ్యత బాధ్యత పూర్తిగా కాంట్రాక్టర్లదే ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. అగ్రిమెంట్లు, సాంకేతిక ప్రక్రియ పూర్తయినందున అక్టోబర్ 25న కచ్చితంగా పనులు ప్రారంభం కావాలని దిశానిర్దేశం చేశారు.



**తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రిజర్వాయర్లలోని నీటిని తాగునీటికే ప్రాధాన్యతనిస్తూ వాడుతున్నామని, మిషన్ భగీరథ పరిధిలోని 86 సమస్యాత్మక జనావాసాల్లో యుద్ధప్రాతిపదికన నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో నీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని తెలిపారు.

**జలసిరి.. మహిళా సాధికారత**

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు 'ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊటకుంట' లక్ష్యంగా జలసిరి కార్యక్రమం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఇప్పటికే రూ. 2 వేల కోట్ల వేతనాలు చెల్లించామని, అక్టోబర్ 2న జరిగే గ్రామ సభల్లో వచ్చే ఏడాది అభివృద్ధి ప్రణాళికలను ఆమోదించాలని అధికారులకు సూచించారు. మరోవైపు మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, స్వయం సహాయక సంఘాలకు రూ. 67 వేల కోట్ల రుణాలు అందించి 6 లక్షల మంది మహిళలు వ్యాపారాలు పెట్టుకునేలా ప్రోత్సహించామన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరుపైనే ఇస్తూ వారి ఆత్మగౌరవాన్ని పెంచుతున్నామని ఆమె ఉద్ఘాటించారు.

గ్రామ ఆస్తులు, అవసరాలను తెలిపే చిత్రపటాన్ని ప్రతి గ్రామంలో వేసి అవసరాలను గుర్తించాలన్నారు. హనుమకొండ కలెక్టరేట్లో వేసిన చింత నెక్కొండ గ్రామ పటాన్ని మంత్రి సీతక్క పరిశీలించారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తాం.. గ్రామ అవసరాలను తీర్చే విధంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల స్పెషల్ సీఎస్ దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, ఈఎన్సీలు కృపాకర్ రెడ్డి, జగదీశ్వర్, కాంట్రాక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జబ్బుతో బాధపడుతున్న బాలికను కలిసిన మంత్రి**

సమావేశం అనంతరం అరుదైన జబ్బుతో బాధపడుతున్న హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన రిషితను మంత్రి సీతక్క ఆమె ఇంటికి వెళ్లి కలుసుకున్నారు. తనను కలుసుకోవాలన్న రిషిత కోరికను నెరవేర్చిన మంత్రి సీతక్క బాలిక బాగోగులు తెలుసుకున్నారు.

# భద్రాద్రి వద్ద పెరుగుతున్న వరద

- నిండుకుండలా తాలిపేరు ప్రాజెక్ట్
- పది గేట్లు ఎత్తి 55. 437 క్యూసెక్కుల నీరు విడుదల

**భద్రాచలం, సిరి న్యూస్ , సెప్టెంబర్ 25:**

అల్ప పీడన కారణంగా రాష్ట్రవ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీని కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం. వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతున్నది. శుక్రవారం మధ్యాహ్నానికి 18. 2 అడుగుల ఉన్న గోదావరి నీటిమట్టం సాయంత్రానికి 20, 1 అడుగుకు చేరుకుంది. ఎగువ ప్రాంతాలలో ఉన్న ప్రాజెక్టులు నుండి నీరు విడుదల చేయడంతో ఇది క్రమంగా పెరుగుతూ శనివారం ఉదయం నుంచి మరింత పెరిగి 25 అడుగుల నుండి 30 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే చర్ల మండలంలో ఉన్న తాళపేరు ప్రాజెక్ట్ నిండు కుండలా మారడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పదిహేను ఎత్తివేశారు. 55. 437 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. అలాగే చత్తీస్ గఢ్, ఒడిశా, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుకుంటున్నది. దీని కారణంగా భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతున్నది. మేడిగడ్డ ప్రాజెక్టు నుండి 85 గేట్లు ఎత్తివేసి 41, 520 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులు వరద నీరు ప్రమాద స్థాయికి చేరుకోవడంతో కింది భాగానికి నీటిని విడుదల చేస్తున్నారు. దీని కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్నది.



**అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్**

భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమ క్రమంగా పెరుగుతున్న దృశ్య అధికారులను జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రమాద పరిస్థితిని ముందుగానే గమనించాలని అవసరమైతే లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే భారీ వర్షాల కారణంగా ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్ల వద్దని కోరారు.

# రాష్ట్రంలో 200 కొత్త జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- హనుమకొండకు 7 కోర్టులు.. వరంగల్‌కు 5 మంజూరు

**హనుమకొండ, సిరి న్యూస్, సెప్టెంబర్ 25 :**

తెలంగాణలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా న్యాయవ్యవస్థ పరిధిలో 200 కొత్త అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జికమ్‌అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయశాఖ జీవో ఎంఎస్ నెం.59, తేదీ 24092026ను జారీ చేసింది.

తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) రాష్ట్రంలో 594 కొత్త కోర్టుల ఏర్పాటుకు అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు, పునరావృత-పునరావృతేతర వ్యయాలకు బడ్జెట్‌తో సహా అనుమతి కోరగా, ప్రభుత్వం పరిశీలన అనంతరం తొలి విడతలో 200 కోర్టులకు అనుమతి ఇచ్చింది. అవసరమైన సిబ్బంది, ఇతర వ్యయాలకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. తదుపరి చర్యలు చేపట్టాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ప్రభుత్వం కోరింది.

ఉమ్మడి వరంగల్ ప్రాంతానికి కూడా ప్రాధాన్యం లభించింది. జీవోకు జతచేసిన జాబితా ప్రకారం హనుమకొండ జిల్లా పరిధిలో హనుమకొండలో 6, పరకాలలో ఒకటి కలిపి మొత్తం 7 కొత్త కోర్టులు మంజూరయ్యాయి. వరంగల్ జిల్లా పరిధిలో వరంగల్ ఎట్ హనుమకొండలో 4, నర్సంపేటలో ఒకటి కలిపి మొత్తం 5 కోర్టులు ఏర్పాటు కానున్నాయి. అదేవిధంగా జనగామలో 2, స్టేషన్ ఘన్‌పూర్‌లో ఒకటి; జయశంకర్ భూపాలపల్లిలో 2; ములుగులో ఒక కొత్త కోర్టును ప్రతిపాదిత జాబితాలో పొందుపరిచారు.



రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 200 కోర్టుల కేటాయింపును అనుబంధ జాబితాలో ప్రభుత్వం ఖరారు చేసింది. కొత్త కోర్టుల ఏర్పాటు ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి అదనపు న్యాయస్థానాల సామర్థ్యం అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు.

# రాహుల్ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- ప్రధాని, హోంమంత్రిపై వ్యాఖ్యలు దురదృష్టకరం
- ఫిరాయింపులు ప్రోత్సహిస్తూ ఓట్ చోరీ అనడం ద్వంద్వ వైఖరి
- రాజ్యాంగబద్ధ సంస్థలు, బలగాలపై నమ్మకం లేకపోవడం సిగ్గుచేటు
- రాహుల్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్ సిరి న్యూస్ , సెప్టెంబర్ 25:**

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజలచే ఎన్నికైన ప్రధానమంత్రి, హోంమంత్రిని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశద్రోహి అని వ్యాఖ్యానించడం ఆయన మానసిక దుస్థితికి, అసహనానికి నిదర్శనమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. వరుస ఓటములతో మానసిక సమతుల్యత కోల్పోయిన రాహుల్ గాంధీ బహిరంగంగా మాట్లాడే ముందు మానసిక వైద్యుడిని సంప్రదిస్తే మంచిదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

**అసలైన 'ఓట్ చోరీ' కాంగ్రెస్‌దే**

బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేయడాన్ని స్వాగతించి క్షమాపణలు చెప్పాల్సింది పోయి ప్రజాస్వామ్య పాఠాలు చెప్పడం హాస్యాస్పదమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల టికెట్లపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడమే అసలైన 'ఓట్ చోరీ' అని దుయ్యబట్టారు. ప్రజల తీర్పును దొంగిలించిన కాంగ్రెస్‌కు ఇతరులపై ఆరోపణలు చేసే నైతిక హక్కు లేదన్నారు.

**రాజ్యాంగ సంస్థలపై నమ్మకం లేదు:**

కాంగ్రెస్ పార్టీకి సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్, ఈవీఎంలు, దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలతో పాటు దేశాన్ని కాపాడే సాయుధ బలగాలపై కూడా నమ్మకం లేదని విమర్శించారు. విచారణ సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ బెయిల్‌పై బయట ఎందుకు తిరుగుతున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్లు, ఇతర పార్టీలు గెలిస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగినట్లు మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందన్నారు.

**ఓటర్లను అవమానించడం సిగ్గుచేటు**

భారత ఓటర్లను ఇరాక్, ఉత్తర కొరియా ప్రజలతో పోల్చడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని కిషన్ రెడ్డి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందుతున్న ప్రధానమంత్రిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదని, రాహుల్ గాంధీ తన వైఖరిని మార్చుకోకపోతే గతంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే మళ్లీ పడుతుందని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# మోటార్లు నడిపి జలాశయాలు నింపాలి

**మొదటిపేజీ తరువాయి**

మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. ఇక్కడ 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉంది. మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు మీరు చెబుతున్న మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లోనూ 15 టీఎంసీలకు కేవలం 6 టీఎంసీలే ఉన్నాయి. ఇక్కడికి సైతం నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుంది. ఈ రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదం చేసినట్లవుతుందన్నారు. మరోవైపు మిడ్ మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండి)లో ప్రస్తుతం 11 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లోని రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారు.

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. అయితే రంగనాయక సాగర్‌లో నీళ్లు లేకపోవడం వల్ల ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితితో పామ్ ఆయిల్ సాగు చేస్తున్న రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి కోసం రైతులు కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తుంటే మీరు మాత్రం నదుల్లో వస్తున్న నీళ్లను లిఫ్ట్ చేయకుండా కిందకు వదిలిపెడుతున్నారు అని విమర్శించారు. ప్రస్తుతం గోదావరిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని అన్ని మోటార్లను నడిపి నీళ్ళు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మీరు చేస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నది. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే దానికి కారణం నీటి నిర్వహణలో మీ ప్రభుత్వ వైఫల్యం. ఇప్పటికైనా కళ్ళు తెరవండి.. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు.. ఎల్‌నినోను సాకుగా చూపకుండా అందివచ్చిన గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా ఆన్‌ఆఫ్ పద్ధతిలో కాక 24 గంటల పాటు అన్ని మోటార్లు నడిపి జలాశయాలను నింపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపం నెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని హరీష్‌రావు హితవు పలికారు.



# బాలాపూర్ లడ్డూ @రూ.39 లక్షలు

**మహేశ్వరం, సిరి న్యూస్ సెప్టెంబర్ 25:**

ప్రపంచ ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణపతి లడ్డు వేలం పాటకు జిహెచ్ఎంసి బడంగ్ పేట్ సర్కిల్ బాలాపూర్ గ్రామం బొడ్డురాయి వేదికయ్యింది. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు చేస్తూ.. స్వామి వారి పాటలు పాడుతూ.. ఊరు చుట్టూ ఊరేగింపు నిర్వహించి, గ్రామ బొడ్రాయి వద్దకు గణనాథుని తీసుకువచ్చారు. అనివార్య కారణాలవల్ల ఊరేగింపుకు కొంత ఆలస్యం జరగడంతో, లడ్డు వేలం పాట దాదాపు రెండు గంటలకు పైగా ఆలస్యం అయింది. భక్తులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న బాలాపూర్ గణేష్ లడ్డు వేలం పాటను వేలాది మంది భక్త జన సందోహం నడుమ ఉత్సవ కమిటీ సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. లడ్డు వేలం పాటలో సాహెబ్ నగర్ కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి, చంపాపేట్కు చెందిన మర్రి రవికిరణ్ రెడ్డి, చంపా పేట్కు చెందిన కెవిఆర్ ఫ్లవర్ మర్చంట్ కందాడ శాలిని వీరేందర్ రెడ్డి, హస్తినా పురంకు చెందిన కంచర్ల శివారెడ్డి, లండన్ నుంచి సుశి ఆండ్ కో నుంచి సామ దయానంద్ రెడ్డి, సామ వరానంద్ రెడ్డి, హస్తినా పురంకు చెందిన జిఎర్ఆర్ డెవెలపర్స్ నుంచి గడ్డం నవీన్ రెడ్డి, బాలాపూర్ నుంచి ఇబ్రాం ప్రత్యూష్, బాలాపూర్ కు చెందిన రితున్ రెడ్డితో కలిపి 9 మంది ప్రధానంగా వేలం పాటలో పాల్గొన్నారు. రూ.1016తో ప్రారంభమై హోరాహోరీగా సాగిన పోరులో రూ.39 లక్షలకు సాహెబ్ నగర్ కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి 21 కిలోల లడ్డును వేలం పాటలో దక్కించుకున్నారు. తాజాగా 33వ సారి బాలాపూర్ గణేష్ లడ్డును వేలం పాటలో దక్కించుకున్న జాబితాలో సామ ప్రణీత్ రెడ్డి చేరిపోయారు.



# జార్ఖండ్ మంత్రి కుమార్తె మృతి.. మంత్రి సీతక్క విచారం

**వరంగల్, సిరి న్యూస్ , సెప్టెంబర్ 25 :**

జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీపికా పాండే సింగ్ కుమార్తె త్రిషా సింగ్ జంషెడ్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. త్రిషా సింగ్ అకాల మృతి పట్ల మంత్రి సీతక్క తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ దీపికా పాండే సింగ్‌తోపాటు ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# శ్రీ రాఘవేంద్ర వినాయకునికి మహిళలు మంగళ హారతులు



సదాశివపేట. సెప్టెంబర్ 25. (సిరిన్యూస్)

సదాశివపేట శాస్త్రి రోడ్డులోని శ్రీ రాఘవేంద్ర యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వినాయకునికి మంగళారతులు ఇవ్వడం జరిగింది. 51 రకాల స్వీట్లు తో నైవేద్యాలు సమర్పించారు. భక్తి పాటలతో భజన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అనంతరం శ్రీ రాఘవేంద్ర యూత్ కమిటీ ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, మాధవి, లావణ్య, చంద్రకళ, లక్ష్మి, అక్షిత శ్రీ తన్వి సంధ్య నందిని, రేఖ, లత, లక్ష్మి, పద్మావతి, నిర్మల, పరిశుద్ధ, విజయ, వర్షిత తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వినాయక నవ రాత్రులు



- 3 లక్షల కు పైగా పలికిన లడ్డు వేలం

పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 25, (సిరి న్యూస్):

పెద్ద శంకరంపేట పట్టణంలోని మాధవ నగర్ కాలనీలో జరిగిన వినాయక నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలంలో హైదరాబాద్ మేడ్చల్‌కు చెందిన గజం సాయికిరణ్ రూ.3,09,999కు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకోగా, రెండో లడ్డును అదే కాలనీకి చెందిన సాంబయ్య గారి ప్రభాకర్ రూ.66,666కు సొంతం చేసుకున్నారు. భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా జరుపుకునే వినాయక నవరాత్రి ఉత్సవాలు కేవలం పూజా కార్యక్రమాలు మాత్రమే కాదు—స్థానిక సామాజిక ఐక్యత, ధార్మిక ఉత్సాహం, దాతృత్వ భావానికి ప్రతీక. మాధవ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం చుట్టూ ఈ ఉత్సవాలు కుటుంబాలను, పొరుగు వారిని ఒకే వేదికపై చేర్చాయి. లడ్డూ వేలం ద్వారా భక్తులు తమ భక్తిని, దాన ధర్మాన్ని చాటుకున్నారు.

# అంగన్వాడి సెంటర్ లో అన్నప్రాసన



పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 25, (సిరి న్యూస్),:

పెద్ద శంకరంపేట పట్టణం లోని 9వ నెంబర్ అంగన్వాడి సెంటర్లో శుక్రవారం అన్న ప్రసన్న కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోషణ మాసంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ ఉపాధ్యాయిని సరళ పేర్కొన్నారు. అందులో భాగంగానే చంటి పిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు మొలకెత్తిన విత్తనాలు వల్ల పిల్లలు ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతుందని అన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు పిల్లలకు తినిపించాలని పేర్కొన్నారు పలు వంటకాలను ఏర్పాటు చేసి వాటిలో ఏ ఏ విటమిన్లు ఉంటాయో తల్లులకు వివరించారు. తల్లులచే పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించి, పోషక ఆహార వస్తువులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు.

# హనుమాన్ మందిర గణేష్ నిమజ్జనోత్సవ ఊరేగింపు



సదాశివపేట. సెప్టెంబర్ 25. (సిరిన్యూస్)

శాస్త్రి రోడ్ హనుమాన్ మందిరంలోని గణేష్ నిమజ్జన ఉత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన భక్తబృందం వారిచే భక్తి పాటలతో నిమజ్జన ఉత్సవ ఊరేగింపును తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లోపలి కోటలోని ప్రజలు భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ కులగనన నిర్వహించాలి

- ప్రత్యేక కాలము ఏర్పాటు చేయాలి
- పోరుబాటతో పలు ఉద్యమాలను చేపడతాం
- బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారాం



రామాయంపేట, సెప్టెంబర్ 25 (సిరి న్యూస్)

దేశవ్యాప్తంగా చేపడుతున్న జనాభా లెక్కల సేకరణలో ఓబీసీలకు ప్రత్యేక కాలం చేర్చి బీసీ కులగలను చేసే వరకు తమ పోరాటం ఆగదని బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టుగంగారం స్పష్టం చేశారు.. గురువారం నాడు రామాయంపేటలోని బీసీ భవన్ లో గంగారాం మాట్లాడుతూ దేశ జనాభాలో 50% పైగా ఉన్న బీసీలపై మొసలి కన్నీరు కార్చే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.జనగణన లో కులగలను చేపట్టకపోవడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పేరుకే ఓబీసీ ప్రధాని తప్ప బీసీలకు ఒరిగింది శూన్యమని అన్నారు. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఓబీసీ కాలం పెట్టాలని చేసిన తీర్మానంపై బిజెపి శాసనసభ పక్ష నేతలు వ్యతిరేకంగా వ్యవహరించి వాకౌట్ చేయడాన్ని వారిని ఆయన బీసీ ద్రోహులుగా అభివర్ణించారు. బీసీ కులగనణ సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం గల్లి నుండి ఢిల్లీ వరకు పోరుబాటతో పలు ఉద్యమాల కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 4న పాలమూరు నుంచి బీసీ కుల గణన గర్జన కార్యక్రమాన్ని చేపట్టి అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతోపాటు మేధావులు ప్రొఫెసర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆలోచించి జనగణనలో ఓబీసీ కాలము చేర్చాలని లేకుంటే దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గంగారం గారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మెదక్ నియోజకవర్గ కన్వీనర్. మామిడి సిద్ధరాములు,రామాయంపేట మండల అధ్యక్షుడు.. ఉడుత రాజేష్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో ప్రతి ఫార్మసిస్టుకు అండగా ఉంటాం

- తెలంగాణ ఫార్మసి కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రాజు.

మెదక్ సెప్టెంబర్,25(సిరి న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఫార్మసిస్టుకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రాజు అన్నారు.ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మెదక్ పట్టణంలోని చైతన్య భారతి హైస్కూల్‌లో మెదక్ జిల్లా ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఫార్మసిస్టులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తొడుపునూరి రాజు మాట్లాడుతూ, ఫార్మసిస్టుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఫార్మసిస్టులు, కెమిస్టుల మధ్య సమన్వయం పెంపొందించి, ఫార్మసిస్టులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఫార్మసిస్టులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. మెదక్ జిల్లా ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని జుబేర్ అహ్మద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మెదక్ జిల్లా ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ఫార్మసిస్టుకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.




ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రతి ఒక్కరూ అసోసియేషన్‌లో సభ్యత్వం పొంది అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఫార్మసిస్టుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సంగమేశ్వట్టం, రాగం శ్రీనివాస్, కోశాధికారి రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

- దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి.
- పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కన్వీనర్ మహేందర్ రెడ్డి.

మెదక్ సెప్టెంబర్, 25(సిరి న్యూస్)



ఎవరి ప్రయోజనాల కోసం అర్హులైన ఓట్లు తొలిగిస్తూ..అనర్హుల ఓట్లు చేర్చే ప్రక్రియ చేపట్టి దేశ ద్రోహానికి పాల్పడుతున్నా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసి దేశానికి క్షమాపణ చెప్పాలని,పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కన్వీనర్ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో ఉన్న మేధావులు, ప్రజలు ఎన్నికల సంఘం పనితీరు, వారి నిర్ణయాలపై అనుమానం వ్యక్తం చేశారు. నేడు ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై అధికారికంగా అభ్యంతరాలు తెలిపారు.ఈ అభ్యంతరాలు ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు-పునరుద్ధరణ, ఫారం 6 మార్పులు, ఓటర్ల డేటా నిర్వహణ వంటి అత్యంత కీలక అంశాలపై నిలదీశారు. ముఖ్యంగా, ఇద్దరు కమిషనర్లు కొన్ని చర్యలు సరైనవి కాదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాదు,ఓటర్ల డేటాబేస్‌ను కేంద్రీకృతం చేయడం, ఎన్నికల సాఫ్ట్‌వేర్‌పై నియంత్రణ వంటి అంశాలపైనా వారు ఆందోళనలు వ్యక్తం చేశారు. అదే విధంగా గతంలో ఎన్నికలు జరిగిన బెంగాల్‌లో 90 లక్షల ఓట్ల తొలగింపు, అస్సాంలో 45 లక్షల ఓట్ల తొలగింపు, బీహార్‌లో 45 లక్షల ఓట్ల తొలగింపు, హర్యానాలో 25 లక్షల దొంగ ఓట్ల చేర్పు, మహారాష్ట్రలో 50 లక్షల దొంగ ఓట్ల చేర్పు వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే నన్నారు. అదే విధంగా గోవాలో 97 మంది అర్హులైన ఓటర్ల విషయంలో సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా ఎన్నికల అధికారులు తీసుకున్న నిర్ణయాలను నమోదు చేయడంలో సమస్య ఏర్పడిందని వెల్లడైందన్నారు.ఓటర్ల హక్కులు కేవలం అధికారుల నిర్ణయాలపైనే కాకుండా సాంకేతిక వ్యవస్థపైనా ఆధారపడే పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తరు. దేశ వ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున ఎవరి ఆదేశాల మేరకు ఓట్లు తొలగిస్తున్నారు? అలాగే డిలీట్ అయిన ఓటర్ రిజిస్ట్రేషన్‌కు ఢిల్లీ కార్యాలయంలో అనుమతి ఇచ్చేలా ఎవరు చేశారు? ఎవరి ప్రయోజనాల కోసం దేశ ప్రజల ఓట్లు తొలగించి దేశ ద్రోహానికి పాల్పడ్డారో బయటపడాలన్నారు. ఈ అంశాలపై పూర్తి నిజాలు దేశ ప్రజల ముందుకు రావాలని, దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి






- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
- దిశ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు

మెదక్ సెప్టెంబర్, 25(సిరి న్యూస్)

మెదక్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు వాటి ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, విద్యుత్, మహిళా మరియు శిశు సంక్షేమం, సామాజిక సంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించి వాటి పురోగతిని తెలుసుకున్నారు. రామ్ జీబివి పథకం ద్వారా చేపడుతున్న పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూడాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యా, వైద్యం, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం చేయకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజా ప్రతినిధులు,జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు లక్ష్యాలను చేరుకుంటాయని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాకు అందుతున్న నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అధికారుల సమన్వయంతో పథకాలు ప్రజలకు అందేలా చూడలన్నారు. ఎంపీ రఘునందన్ రావు సూచించిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, వచ్చే దిశ మీటింగ్ వరకు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు , జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, జిల్లా స్థాయి అధికారులు, దిశా కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేసిన సర్పంచ్

వెల్దండ సెప్టెంబర్ 25

వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే పేదల సొంతింటి కల నెరవేరుతుందని సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నం భూపతి రెడ్డి అన్నారు వెల్దండ మండల కేంద్రానికి చెందిన కదమంచి సత్యమ్మ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్ల లబ్ధిదారులకు ఇళ్లకు సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నం భూపతిరెడ్డి భూమి పూజ చేసి ముగ్గు పోసి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి ల సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను వార్డు నెంబర్ సభ్యులు వాణి పురుషోత్తం తుంగ శ్రీనివాసులు మట్ట మల్లేష్ గౌడ్ సాంబయ్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# నేడే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

- ఉదయం 9:30 గంటలకు మెదక్ మార్కెట్ యార్డులో ఘనంగా ప్రారంభోత్సవం.
- 29,183 మంది విద్యార్థులకు లబ్ది చేకూరానున్న ,అల్పాహారం పథకం.





**మెదక్, సెప్టెంబర్ 25 (సిరి న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మెదక్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను శనివారం, ఉదయం 9:30 గంటలకు ప్రజాప్రతినిధులు చే ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనతో మధిర, మంథని, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల్లో కూడా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా మెదక్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సిద్ధం చేశారు. ఈ కిచెన్ ద్వారా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 11 మండలాల పరిధిలో 395 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందించనున్నారు. విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సహకారంతో మెనూను రూపొందించారు. ప్రతిరోజూ వివిధ రకాల అల్పాహారాన్ని అందించడంతో పాటు, విద్యార్థులకు రోజు విడిచి రోజు వేడి పాలను కూడా అందించనున్నారు. ఉదయం పూట పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ఉపయోగపడుతుందాన్నారు.




**అల్పాహార మెనూ:**

- ఇడ్లీ – సాంబార్
- పూరి – ఆలూ కుర్మా
- దోశ – చట్నీ
- ఉప్మా – చట్నీ
- మిల్లెట్ ఇడ్లీ – సాంబార్
- బోండా – చట్నీ

# జోగిపేటలో భక్తి శ్రద్ధలతో జైనుల 'దాస్ లక్షణ్ పర్వ్'

- పది రోజుల పాటు పండగ నిర్వాహణ
- రెండు రోజుల పాటు హాజరైన కలెక్టర్ ప్రతీక్ జైన్



**జోగిపేట, సెప్టెంబర్ 25, (సిరి న్యూస్):**

ఆధ్యాత్మికత, ఆత్మశుద్ధి, మరియు క్షమాపణల కలయికతో జరుపుకునే జైనుల అత్యంత పవిత్రమైన పండుగ 'దాస్ లక్షణ్ పర్వ్' (దశలక్షణ పర్వం). సాధారణంగా ప్రతి సంవత్సరం భాద్రపద మాసంలో ( ఈ సంవత్సరం 16 సెప్టెంబర్ నుండి 26 సెప్టెంబర్ 2026) 10 రోజుల పాటు ఈ పండుగను ప్రపంచవ్యాప్తంగా ఉన్న జైన సమాజం, ముఖ్యంగా దిగంబర జైనులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.మిగిలిన పండుగల్లాగా ఇది కేవలం విందు వినోదాల పండుగ కాదు, ఇంద్రియాలను నిగ్రహించుకుని, ఆత్మను కర్మల నుండి శుద్ధి చేసుకునే పశ్చాత్తాప పండుగ.

**ఆత్మశుద్ధి (ఆత్మ కల్యాణం):**

ఈ పది రోజులు మానవుడు తనలోని కోపం, అహంకారం, లోభం వంటి చెడు గుణాలను వదిలిపెట్టి ఆత్మను పవిత్రం చేసుకోవడానికి కేటాయిస్తాడు.

**ఉపవాసాలు – ధ్యానం:**

ఈ పర్వదినాల్లో జైనులు కఠినమైన ఉపవాస దీక్షలు చేపడతారు. సూర్యాస్తమయం తర్వాత ఆహార పానీయాలకు దూరంగా ఉంటూ, పవిత్ర గ్రంథాల పఠనం, ధ్యానంలో గడుపుతారు.

**క్షమాపణ దినోత్సవం (క్షమావాణి):**

పండుగ ముగింపు సందర్భంగా 'ఉత్తమ క్షమ' లేదా 'క్షమావాణి దివస్' జరుపుకుంటారు. ఈ రోజున తెలిసి లేదా తెలియక తాము చేసిన తప్పులకు ఇతరులను క్షమాపణ కోరుతూ, అందరి పట్ల మైత్రీ భావాన్ని ప్రకటిస్తారు. ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న ఒత్తిడి, కోపం, స్వార్థం వంటి వాటి నుండి విముక్తి పొంది, ప్రశాంతమైన మరియు ధార్మికమైన జీవితాన్ని గడపడానికి 'దాస్ లక్షణ్ పర్వ్' ఒక దివ్యౌషధం లాంటిదని జైన గురువులు పేర్కొంటున్నారు. జోగిపేటలోని జైనులు ఈ 10 రోజుల కార్యక్రమాలలో స్థానిక జైనులు కిషన్ ప్రసాద్, సత్యనారాయణ, వర్ధమాన్, మనోహర్ ప్రసాద్, శ్రీనివాస్, దీ లిప్, ఉ వర్ధమాన్, సంతోష్, సంపత్, కిట్టు, లఖన్ ప్రసాద్ మరియు వారి కుటుంబ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు.

# బై బై గణేశా...! గంగమ్మ ఒడిలో గణపయ్య

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వినాయక నిమజ్జనాలు.
- భక్తి శ్రద్దలతో పాల్గొన్న యువత,జిల్లా ప్రజలు, నిర్వాహకులు.
- వివిధ గణేష్ మండపాల్లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్ రావు.
- కోమటూర్ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన.







**మెదక్ సెప్టెంబర్,25(సిరి న్యూస్)**

జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రులు ఎంతో భక్తి శ్రద్దలతో నిర్వహించడం సంతోషకరం అని మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.ప్రజలకు శాంతి, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని వినాయకుడిని ప్రార్థించారు.పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో మున్సిపల్ శాఖ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని స్వాగతం పలికారు.ఎమ్మెల్యే రోహిత్ రావు నిర్వాహకులతో కలిసి స్టెప్పులేస్తూ భక్తులను ఉత్సాహపరిచారు. అనంతరం కోమటూర్ చెరువు వద్దకు చేరుకుని వినాయక నిమజ్జన కార్యక్రమాల కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, నిర్వాహకులు చేపట్టిన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల రాకపోకలు, జనసందోహం నియంత్రణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, నిమజ్జన ప్రాంతం వద్ద అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు చేసిన బోట్ లో పర్యిలించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా,

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరిగేలా అధికారులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వాలంటీర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిమజ్జన ప్రాంతంలో పరిశుభ్రతను కాపాడాలని పేర్కొన్నారు. ప్రజలు, భక్తులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని ఎమ్మెల్యే రోహిత్ రావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేశ్ గౌడ్,ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# అర్హులందరికీ సంక్షేమ పథకాలు




- రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు

**రాయికోడ్, సెప్టెంబర్ 25(సిరి న్యూస్):**

ప్రజా ప్రభుత్వం లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ నాలచెరువు కచూర్ రావు, మేడికుంద సర్పంచ్ నాలచెరువు చంద్రకళ అన్నారు. వట్పల్లి మండలం లోని మేడికుంద గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ నూతన రేషన్ కార్డులను శుక్రవారం ఆత్మ కమిటీ చైర్మన్ నాల చెరువు కచూర్ రావు, సర్పంచ్ నాల చెరువు చంద్రకళ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్ నాలచెరువు కచూర్ రావు, సర్పంచ్ నాల చెరువు చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నర్సింహా ఆదేశానుసారం నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం నిర్వహించమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తుందన్నారు. ఆహార భద్రతతో పాటు ప్రజలందరికి అన్ని సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ కార్యదర్శి చరణ్ రాజ్, ఉప సర్పంచ్ నిర్మల నాగయ్య, వార్డు సభ్యులు పోచయ్య, విష్ణు, సురేష్,ప్రేమల,స్వరూప,ప్రభు,రేషన్ డీలర్ ఏర్పుల బేతయ్య,నాయకులు బగిలి వీరప్ప, ప్రవీణ్ గౌడ్, బక్కన్న, శ్రీశైలం, పల్లె క్రిష్ణ, విట్టల్, పీరయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో శ్రీనివాస్ నక్కాకు పీహెచ్.డీ.



**పటాన్ చెరు, సెప్టెంబర్ 25, (సిరి న్యూస్):**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీనివాస్ నక్కా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డిజైన్ ద్వారా విశ్లేషణాత్మక నాణ్యత (AQbD), గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలను ఉపయోగించి ఔషధాలలో నైట్రోసమైన్ ఔషధ పదార్థసంబంధిత మలినాల (NDSRIs) కోసం LC MS పద్ధతి అభివృద్ధికి వ్యూహాత్మక విధానాల'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

డాక్టర్ శ్రీనివాస్ డాక్టరేట్ పరిశోధన, ఔషధాల సంశ్లేషణ, ఫార్ములేషన్, నిల్వ, తయారీ ప్రక్రియల సమయంలో ఏర్పడగల NDSRIsతో ముడిపడి ఉన్న, పెరుగుతున్న ఫార్మాస్యూటికల్, రోగిభద్రతా ఆందోళనలను పరిష్కరిస్తుందని తెలియజేశారు. ఈ అధ్యయనం సిప్రోఫ్లోక్సాసిన్, మోక్సిఫ్లోక్సాసిన్, ఏక్లోఫెనాక్, మెఫెనామిక్ యాసిడ్, టామ్సులోసిన్ తో సహా ఎంపిక చేసిన యాంటిబయాటిక్, యాంటీఇన్ ఫ్లమేటరీ, ఆల్ఫా1 బ్లాకర్ ఔషధ పదార్థాలు, ఉత్పత్తులలో NDSRIs సంశ్లేషణ, విషపూరితత అంచనా, సున్నితమైన పరిమాణీకరణపై దృష్టి సారించిందన్నారు. ఔషధ తయారీలో కఠినమైన నియంత్రణ అవసరాలకు మద్దతునిస్తూ, నాణ్యత నియంత్రణ, రోగిభద్రతా చర్యలను బలోపేతం చేస్తూ, ఈ మలినాలను ఖచ్చితంగా గుర్తించడానికి, వాటి పరిమాణాన్ని నిర్ధారించడానికి అత్యంత సున్నితమైన UPLC-MS/MS విశ్లేషణా పద్ధతిని అభివృద్ధి చేయడం జరిగిందని వివరించారు. డాక్టర్ శ్రీనివాస్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం సిబ్బంది అభినందించారు.

# సూది బుడ్లు.. సిరంజిల కాల్చివేత




**వెల్దుర్తి,సెప్టెంబర్ 25,(సిరి న్యూస్ ):**

గురువారం సిరి దినపత్రికలో వచ్చిన సూది బుడ్లు. సిరంజి లు కాల్చి వేత అనే కథనానికి స్పందించిన ఆరోగ్య కేంద్రం అధికారులు శుక్రవారం అక్కడ పేరుకుపోయిన సూది బుడ్లు.. సిరంజిలు ఇతరత కాల్చివేసిన మందులను తీసివేసి అట్టి ప్రాంగణమును శుభ్రపరిచారు. ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఇకనైనా అధికారులు ఆరోగ్య కేంద్ర ఆవరణలో చెత్త వేయవద్దని ఖాళీ అయిన వైద్యానికి సంబంధించిన వస్తువులను జిల్లా ఆరోగ్య కేంద్రం వారు పంపించిన డబ్బాలోనే పారవేయాలని గ్రామస్తులు సూచించారు.


సూదు బుడ్లు.. సిరంజీలు కాల్చివేత

# వెంకటాపూర్ గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం



- **నూతన బోర్డర్ను బిగించిన సర్పంచ్ కన్నెబోయిన సుజాత**

**కొల్చారం, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్)**

కొల్చారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గత రెండు రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యకు గ్రామపంచాయతీ అధికారులు పరిష్కారం చూపించారు. గ్రామ సర్పంచ్ కన్యబోయిన సుజాత ఆధ్వర్యంలో నూతన బోరు మోటార్‌ను బిగించి ప్రజలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటితో పాటు డ్రైనేజీ, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు, అన్న జ్ఞాపకార్థంగా అన్నదాన కార్యక్రమం



**సదాశివపేట. సెప్టెంబర్ 25. (సిరిన్యూస్)**

సదాశివపేట శాస్త్రి రోడ్డులోని శ్రీ రాఘవేంద్ర వినాయక వద్ద శుక్రవారం నాడు తల్లిదండ్రులు, అన్న జ్ఞాపకార్థంగా అన్నదాన కార్యక్రమంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా నాగారం శ్రీనివాస్ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ స్వర్గస్తులైన తల్లిదండ్రులు నాగారం విట్టల్ నాగమణి సోదరుడు నాగారం అనంత రాములు తమ పేర్లమీదుగా అన్నదానం చేశారన్నారు. తమ పెద్దలు ఏ లోకంలో ఉన్నా కూడా వారి ఆత్మకు శాంతి చేకూరాలని భావనతో అన్నదానం కార్యక్రమం చేపట్టడం జరిగింది అన్నారు. తమ పెద్దల పేరుపైన అన్నదానం చేయడం ద్వారా తన మనసుకు సంతృప్తి చేకూరడం జరుగుతుందన్నారు. అన్నదానంలో భారీ ఎత్తున ప్రజలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగారం నర్సింలు, నాగుల విజయ్ కుమార్, పోల సంగమేశ్వర్, మ్యాకం నరసింహులు, ప్రసాద్, నరేష్ ,సోలాపురం నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న ప్రసాద వితరణ



**సదాశివపేట. సెప్టెంబర్ 25. (సిరిన్యూస్)**

గణేష్ నిమజ్జనం ఉత్సవ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శరత్ చంద్ర తండ్రి కోడూరి దశరథ్ గుప్తా, చెల్లెలు బావ శిల్ప రాఘవేందర్ జ్ఞాపకార్థంగా సదాశివపేటలోని గాంధీ చౌక్ వద్ద టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వారి పేర్లు మీదుగా అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కోడూరి శరత్చంద్ర మాట్లాడుతూ తన తండ్రి చెల్లెలు బావ పేర్ల మీదుగా అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు.

వారు లేని లోటు ఎన్నటికీ కూడా తీరదని వ్యక్తపరిచారు.

ఈ కార్యక్రమంలో కోడూరి అంజయ్య, శరత్ చంద్ర మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- **అన్ని వర్గాల సమన్వయంతో అభివృద్ధి పనులు**
- **సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి**

**జగిత్యాల/పెగడపల్లి, సెప్టెంబర్ 25, :**

ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగు నీటి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతో పాటు కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధితో సంక్షేమం పథకాలను ప్రజలకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ ఆధారితమైన ధర్మపురి నియోజకవర్గంలో ని అన్ని గ్రామాలకు సాగునీటిని అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఇందుకు తగిన నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గొల్లపల్లి మండలంలోని రంగధాముని పల్లి, దీకొండ చెరువు అభివృద్ధి చేసి పెగడపల్లి మండలంలో సాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు డీఏల విషయంలో సానుకూలం











- **జిల్లా పీఆర్టీయు అధ్యక్షుడు ఎ.మాణయ్య**
- **అందోలు, వట్‌పల్లి పీఆర్టీయు సర్వసభ్య సమావేశం**

**జోగిపేట, సెప్టెంబర్ 25, (సిరి న్యూస్):**

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వంతో సామరస్య పూర్వకంగానే పరిష్కరించుకుందామని, ప్రభుత్వం జేఏసీ నాయకులతో డీఏల విషయంలో జరిగిన చర్చలు సానుకూలంగానే ఉన్నట్లు సమాచారం అందుతుందని జిల్లా పీఆర్టీయు అధ్యక్షుడు ఎ.మాణయ్య తెలిపారు. శుక్రవారం జోగిపేటలో జరిగిన అందోలు అర్బన్, రూరల్, వట్‌పల్లి మండలాల పీఆర్టీయు సర్వసభ్య సమావేశానికి హాజరై ప్రసంగించారు. దసరా వరకు రెండు డీఏలు, జనవరి తర్వాత మరొక డీఏ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చినట్లుగా వార్తలు వస్తున్నాయన్నారు. పాత పెన్షన్ అమలు చేయాలని , ఐదు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని పీఆర్సీ అమలు చేయాలని పీఆర్టీయు డిమాండ్ చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే ఏకైక సంఘం పీఆర్టీయు సంఘమేనని అన్నారు. రాష్ట్ర మాజీ పీఆర్టీయు అధ్యక్షుడు లక్ష్మన్ మాట్లాడుతూ పీఆర్టీయు ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాల ఫలితంగా ఎన్నో జీఓలను సాధించగలిగామన్నారు. రాష్ట్ర జేఏసీ ప్రభుత్వ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో సానుకూలత లభించిందన్నారు. డీఏలను చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. సమస్యల సాధనలో పీఆర్టీయు ముందుంటుందన్నారు. పీఆర్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులు, జిల్లా, రాష్ట్ర నాయకులు, అందోలు, వట్‌పల్లి మండలాల పీఆర్టీయు నాయకులు పాల్గొన్నారు.

**అందోలు మండల పీఆర్టీయు నూతన కార్యవర్గాలు ఏకగ్రీవం**

అందోలు, అందోలు అర్బన్ మండల పీఆర్టీయు సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందోలు (అర్బన్) అధ్యక్షుడిగా ఎస్.నరోత్తం కుమార్ ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.జనార్ధన్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడిగా కే.సంతోష్‌కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా జి.రజిత, ఉపాధ్యాక్షులుగా వై.వీరేశం, ఎం.బలరాం, మహిళా ఉపాధ్యాక్షురాలిగా ఎం.రాధిక, కే.శ్రీలత, కార్యదర్శులుగా ఎ.లక్ష్మన్, ఎం.రజనీకాంత్, మహిళా కార్యదర్శులుగా జి.మంజుల, హెచ్.ప్రియాంక, గౌరవ అధ్యక్షులుగా పటాలే సుభాష్‌లు ఎన్నికయ్యారు.

**అందోలు రూరల్ నూతన కార్యవర్గం**

అధ్యక్షుడిగా బి.రాజమల్లు (రోళ్లపాడ్), మండల గౌరవ అధ్యక్షుడిగా పి.మహేష్ చారి, ప్రధాన కార్యదర్శిగా వి.మయాచారి(డాకూరు), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.కిరణ్‌గౌడ్(ఎర్రారం), మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా సుజాత రాణి(తాలెల్మ), ఉపాధ్యాక్షులుగా కే.గణేష్(తాలెల్మ), శంకరయ్య(అక్సాన్‌పల్లి), మహిళా ఉపాధ్యాక్షురాలుగా జే.శాంత కుమారి (బ్రాహ్మణపల్లి), ఎన్.సంధ్యోక్త(నేరడిగుంట), కార్యదర్శులుగా ఎం.శివకుమార్(మాసానిపల్లి), ఎం.రాజు(డాకూరు) మహిళా కార్యదర్శులుగా దస్తమ్మ (తాలెల్మ), బి.భార్గవి(అన్నాసాగర్)లు ఎన్నికయ్యారు.

# తల్లులు, పిల్లలకు పోషణపై అవగాహన



**మునిపల్లి, సెప్టెంబర్ 25 (సిరి న్యూస్):**

పోషణ మాసం సందర్భంగా మునిపల్లి మండలం పెద్దచెల్మెడ రైతు వేదికలో శుక్రవారం పోషణ మాస అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదాశివపేట సీడీపీఓ చంద్రకళ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు బాలామృతం, గుడ్లు, పాలు తదితరాల్లో లభిస్తాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని, రక్తహీనత నివారణకు ఐరన్, కాల్షియం ఉన్న ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని వివరించారు. కార్యక్రమంలో భాగంగా తల్లులు, పిల్లలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శైలజ, జ్యోతి, గ్రామ సర్పంచ్ రాధాబాయి జోషి, ఉప సర్పంచ్ ఖాజామైనోద్దీన్, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, సీహెచ్ఓ చంద్రభాను, అంగన్‌వాడీ టీచర్లు రేణుక రెడ్డి, శాంతమ్మ, లక్ష్మీ, ఆశా వర్కర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, వైద్య సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక స్వామి పల్లకి సేవ

- **రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్.**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 25, (సిరి న్యూస్),:**



ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ శ్రీ సిద్ధి గణపతి దేవాలయంలో వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజైన శుక్రవారం సాయంత్రం దేవాలయంలో నిర్వహించిన స్వామి వారి పల్లకి సేవ, రథయాత్ర కార్యక్రమాల్లో స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వామి వారి కృపతో పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దేవాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళుతున్నామని తెలిపారు. ఇప్పటికే రాజ గోపురాలు పూర్తి చేయడం జరిగిందని, సాలహారం పనులు త్వరలో పూర్తి కానున్నయని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 11 రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు.

# సదాశివపేటలో వైభవంగా రాంమందిర్ వినాయక నిమజ్జనోత్సవం





- **పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్**
- **భక్తిశ్రద్ధలతో ముగిసిన వినాయక నవరాత్రులు..**

**సదాశివపేట, సెప్టెంబర్ 25 (సిరి న్యూస్):**

సదాశివపేట పట్టణంలోని రాంమందిర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుని నిమజ్జన వేడుకలకు ఈ ప్రాంతం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి ఉత్సాహంగా నిమజ్జన వేడుకల్లో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రులను అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజలంతా ఎలాంటి భేదభావాలు లేకుండా ఐకమత్యంతో, సోదరభావంతో పండుగలను జరుపుకోవాలని, సమాజంలో శాంతి భద్రతలు, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు. వినాయకుడి కృపతో సంగారెడ్డి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత ముందుకు వెళ్లాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక నిమజ్జనోత్సవ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీల మలన్న, కోడూరు అంజన్న, చింత గోపాల్, చింత సాయినాథ్, శ్రీధర్ రెడ్డి, నగేష్, చెన్నకర్, సంక్షేప్ గౌడ్, నిజాంపురం అశోక్, జోగులు, మల్లికార్జున, వంశీ, కట్కం కిరణ్ తదితరులతో పాటు యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొని విజయవంతం చేశారు.

## కన్నుల పండువగా నిమజ్జనం

- **ఊట్ల లో అంబరాన్నంటిన ఉత్సవ శోభ**

**జిన్నారం సెప్టెంబర్ 25 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని ఊట్ల గ్రామంలో వివేకానంద యూత్ సభ్యుల ఆధ్వర్యంలో బొజ్జ గణపయ్య నిమజ్జోత్సవం ఘనంగా జరిగింది. శోభాయాత్ర ప్రారంభం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో లంబోదరుడిని ఉంచి,గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు సాగింది. భక్తుల కోలాహలం జై గణేష్,గణపతి బప్పా మోరియా నినాదాలతో గ్రామం మార్మోగింది. యువత భక్తులు తీన్మార్,డప్పు చప్పులకు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. లడ్డు వేలంపాట, మండపం వద్ద లడ్డు ప్రసాదానికి వేలం నిర్వహించగా స్థానిక భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణనాథుని ప్రసాదానికి భారీ స్పందన ఊట్ల మాజీ ఉపసర్పంచ్ ప్రతాపరెడ్డి 76 వేలకు లడ్డును సొంతం చేసుకున్నారు. అనంతరం లడ్డును ఆయన కుమారుడు సుప్రీత్ రెడ్డికి యువజన సంఘం సభ్యులు అందజేశారు.





# సీఈసీపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టండి

- సుప్రీంకోర్టులో పిల్ దాఖలు
- వోటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలు,
- అక్రమ డిలీట్లపై అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ‌పై సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ పై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని అందులో డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అక్రమ రీతిలో వోట్లను డిలీట్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. సీఈసీ జానేశ్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తన బాధ్యతలను ఉల్లంఘించినట్లు అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఆయన ఆ పిల్ దాఖలు చేశారు. వోటర్ల రివిజన్ ప్రక్రియ కోసం అనేక నిర్ణయాలను తమ ఆమోదం లేకుండానే తీసుకున్నట్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఆరోపించిన విషయం తెలిసిందే. సీఈసీ తీసుకున్న నిర్ణయాలు, మార్గదర్శకాలు, సూచనలు, సాఫ్ట్ వేర్ మార్పులను తక్షణమే రద్దు చేయాలని కోరారు. 'సర్' ప్రక్రియతో సంబంధం ఉన్న అంశాల్లో 14 సార్లు సీఈసీ జ్ఞానేశ్ను వ్యతిరేకించినట్లు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి ఆరోపించారు.



# ఆసియా క్రీడల షూటింగ్‌లో గోల్డ్ మెడల్

**ఢిల్లీ, సెప్టెంబర్ 25 :**

ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ దక్కింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో మన దేశానికి రెండో పసిడి పతకం లభించింది. అంతకుముందు మహిళల క్రికెట్ జట్టు బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం నాలుగు జోడీలు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. ఇక, దక్షిణ కొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి. పురుషుల 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రజతం సాధించింది. ఫైనల్‌లో మన షూటర్లు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, రుద్రాంశ్ పాటిల్, నీరజ్ కుమార్ మొత్తంగా 1762 పాయింట్లు సాధించారు. 1766 పాయింట్లతో చైనా టీమ్ స్వర్ణం నెగ్గింది. మరోవైపు స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో జోష్న చిన్నప్ప, సెంధిల్ కుమార్ పతకం ఖాయం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఫిలిప్పీన్స్ జోడీ డేవిడ్ పెలినోజెమైకా అరిబాడోను 113, 115తో ఓడించి మన ఆటగాళ్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. దీంతో కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. అటు టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత ద్వయం మనుష్ షా, దియా చితాలే కూడా పతకం ఖాయం చేసుకున్నారు. క్వార్టర్స్‌లో వీరు హాంగ్‌కాంగ్ జోడీని ఓడించారు.



# మహిళతో ప్రధాని మోదీ మార్ఫుడ్ ఫొటో

- సీజేపీకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 :**

ఒక మహిళతో ప్రధాని మోదీ ఉన్న ఏఐ మార్ఫుడ్ ఫొటోను సీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ పోస్టును తొలగించాల్సిందిగా మెటా సంస్థను ఆదేశించింది. అలాగే, సీజేపీ సహా ఆ సంస్థ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కీలక నేతలు అశుతోష్ రాంకా, రత్నా సింగ్ లకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రధాని మోదీ ఒక మహిళతో ఉన్నట్లు మార్ఫింగ్ చేసిన ఫొటోను ఇటీవల సీజేపీ నేతలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారు. దీంతో ఈ అంశంపై బాధిత మహిళ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. జస్టిస్ గిరీష్ కత్పాలియా ఆధ్వర్యంలోని బెంచ్ దీనిపై విచారణ జరిపింది. ఈ అంశం ఒక అసాధారణ పరి స్థితికి సంబంధించిందన్నారు. ఎందుకంటే ఒక సాధారణ మహిళతోపాటు దేశ ప్రధాని ఉన్న ఫొటోకు సంబంధించిన అంశమని కోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీ పోలీసులు ఈ విషయంలో సున్నితంగా వ్యవహరించకపోతే కోర్టు సున్నితంగా స్పందిస్తుందని తెలిపింది. ఈ అంశంలో సీజేపీ నేతలకు నోటీసులు జారీ చేసిన కోర్టు ఫొటోలు, దీనికి సంబంధించి అన్ని పోస్టులు తొలగించాలని సోషల్ మీడియా సంస్థ మెటాను ఆదేశించింది.

# జ్ఞానేష్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలు

- బీహార్‌లో కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం
- అస్సాంలో గౌరవ్ గొగోయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పాట్నాలో కాంగ్రెస్ కార్యకర్తలపై వాటర్ కెనాన్ల ప్రయోగం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 :**



భారత ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తన దేశవ్యాప్త ఆందోళనను శుక్రవారం ప్రారంభించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఆయన ఆధ్వర్యంలో తీసుకున్న అన్ని నిర్ణయాలు, ఓటర్ల జాబితా మార్పులపై స్వతంత్ర సమీక్ష జరపాలని డిమాండ్ చేస్తూ తమతమ రాష్ట్ర ఎన్నికల సంఘాల కార్యాలయాల వరకు శుక్రవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కాంగ్రెస్ తన రాష్ట్ర విభాగాలను గురువారం ఆదేశించింది. ఈ మేరకు ఢిల్లీ, పాట్నా, జమ్మూ, కోల్‌కతా, పంజాబ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ వరకు జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం వీధుల్లోకి వచ్చారు. ఢిల్లీలో పార్టీ నాయకులు బ్యారికేడ్లను బద్దలుకొట్టి ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి.. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే మౌనంగా కూర్చోబోము.. దీనికి బాధ్యులైన వారిని శిక్షిస్తాము' అని కాంగ్రెస్ ఢిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ నినదించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఆయన ముఖం ఉన్న మాస్కులు ధరించి, చేతులకు సంకెళ్లు వేసుకుని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీలో నిరసన తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించారు. అస్సాంలో సీఈసీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌తోపాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీహార్ రాజధాని పాట్నాలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. కోల్‌కతా, చండీగఢ్, జమ్మూ సహా పలు రాష్ట్ర రాజధానుల లో, ఇతర ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ పార్టీ నిరసన ప్రదర్శనలను నిర్వహించింది.

# యువతతో మోడీ 'భజన్ క్లబ్బింగ్'

- ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమం
- యువతతో కలిసి భక్తి గీతాలను ఆస్వాదించిన ప్రధాని
- చప్పట్లు కొడుతూ.. కంజర వాయిస్తూ ఉత్సాహం
- • సంప్రదాయ భజనలకు ఆధునిక సంగీత హంగులే 'భజన్ క్లబ్బింగ్'
- జెన్ జెడ్‌లో ఆదరణ పొందుతున్న కొత్త సంగీత ధోరణి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:**

ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం యువతతో కలిసి 'భజన్ క్లబ్బింగ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ పార్క్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన భక్తి గీతాలను ఆస్వాదించారు. ముందు వరుసలో కూర్చున్న మోడీ భజనలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ కనిపించారు. ఓ భజన సందర్భంగా కంజర వాయిద్యాన్ని కూడా వాయించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని భజనలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా గడిపారు.

'భజన్ క్లబ్బింగ్' అంటే.. సంప్రదాయ భక్తి గీతాలకు ఆధునిక సంగీత కచేరీల హంగులు జోడించి నిర్వహించే కార్యక్రమమే 'భజన్ క్లబ్బింగ్'. లైవ్ మ్యూజిక్, ఆధునిక వాయిద్యాలతో ఉత్సాహభరిత వాతావరణంలో భజనలు, కీర్తనలు ఆలపించడం దీని ప్రత్యేకత. సాధారణ క్లబ్బింగ్‌కు భిన్నంగా ఇందులో భక్తి, ఆధ్యాత్మిక గీతాలకే ప్రాధాన్యం ఉంటుంది. ఈ తరహా కార్యక్రమాలు జెన్ జెడ్ యువతలో ఆదరణ పొందుతున్నాయి.

ఢిల్లీలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో 'భజన్ క్లబ్బింగ్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మాలవీయ నగర్ మార్కెట్‌లోనూ ఇలాంటి కార్యక్రమం జరిగింది. సంప్రదాయ భక్తి సంగీతాన్ని ఆధునిక ప్రదర్శన శైలితో యువతకు చేరువ చేయడం వీటి ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు పేర్కొంటున్నారు.

# 'బ్రహ్మోస్'తో పాక్‌కు నిద్రలేని రాత్రులు!

- అమేఠీ ఏకే-203 రైఫిళ్లతో మావోయిస్టులు, ఉగ్రవాదులకు వణుకు
- యూపీని గుండారాజ్యం నుంచి సుపరిపాలన వైపు నడిపించిన సీఎం యోగి ఆదిత్యనాథ్
- నోయిడాలో 'ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన'ను ప్రారంభించిన అమిత్ షా

**గ్రేటర్ నోయిడా, సెప్టెంబర్ 25 :**

ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు 'నిద్రలేని రాత్రులు' మిగులుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అమేఠీలో తయారవుతున్న ఏకే203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదుల్లో భయం పుట్టిస్తున్నాయని అన్నారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం ప్రారంభమైన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి పాల్గొన్న అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను అమిత్ షా తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఆ సమయంలో బ్రహ్మోస్ క్షిపణులను సమర్థంగా వినియోగించామని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో బ్రహ్మోస్ క్షిపణుల అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, పరీక్షల కేంద్రం ఏర్పాటైందని, 2025 అక్టోబర్‌లో అక్కడ తయారైన తొలి బ్యాచ్‌ను పంపించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రక్షణ పారిశ్రామిక కారిడార్‌లోని ఆరు కేంద్రాల్లో పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా తెలిపారు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రక్షణ రంగం, వాహన తయారీ, వైద్య పరికరాలు సహా అనేక రంగాల్లో రాష్ట్రం ముందుకు వెళ్తోందని ఆయన పేర్కొన్నారు. ఇవి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అమిత్ షా చేసిన అంచనాలు.

మాఫియా పాలన నుంచి పెట్టుబడుల కేంద్రంగా

2017కు ముందు ఉత్తర్‌ప్రదేశ్‌లో మాఫియా ప్రభావం తీవ్రంగా ఉండేదని అమిత్ షా ఆరోపించారు. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, అదే పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను సృష్టించిందని పేర్కొన్నారు. 2013లో అప్పటి సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల సదస్సును లక్నోలో నిర్వహించలేక ఢిల్లీకి తరలించాల్సి వచ్చిందని కూడా ఆయన చెప్పారు. ఇవి రాజకీయ ప్రత్యర్థుల పాలనపై షా చేసిన విమర్శలు.

'ఒక జిల్లాఒక ఉత్పత్తి'పై ప్రశంసలు

ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఒక జిల్లాఒక ఉత్పత్తి' కార్యక్రమాన్ని అమిత్ షా ప్రశంసించారు. స్థానిక ఉత్పత్తులకు దేశ, విదేశీ మార్కెట్లను అందించేందుకు అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సంబంధిత నూతన వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు జరిగే ఈ ప్రదర్శనలో



రక్షణ, వాహనాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ఉత్పత్తులు, వస్త్రాలు, ఔషధాలు, పర్యాటకం సహా అనేక రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయి. దేశీయ తయారీని విస్తరించి భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అమిత్ షా పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వాల విధానాల వల్ల ఉత్తర్‌ప్రదేశ్‌లో పెట్టుబడుల వాతావరణం మారిందని ఆయన అన్నారు

# నాలుగేళ్లలో 111 మంది పార్టీ జంప్

- 2022-26 మధ్య పార్టీలు మారిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఏడీఆర్ నివేదిక
- జాబితాలో 26 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు
- పార్టీ మారిన వారిలో మరో 78 మంది ఎమ్మెల్యేలు
- నాగాలాండ్‌లో అత్యధికంగా 32 ఫిరాయింపు కేసులు
- తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి తొమ్మిది మంది ఎమ్మెల్యేలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:**

దేశవ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులు కొనసాగుతున్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. 2022 నుంచి 2026 మధ్య నాలుగేళ్ల కాలంలో ఎన్నికల్లో గెలిచిన 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలు మారినట్లు పేర్కొంది. వీరిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు, 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్లు తెలిపింది. నాగాలాండ్‌లో అత్యధికంగా 32 ఫిరాయింపు కేసులు నమోదవగా, పశ్చిమ బెంగాల్ తర్వాతి స్థానంలో నిలిచింది.

నాగాలాండ్‌లో అత్యధికం నాగాలాండ్‌లో ఎన్డీపీపీ, ఎన్‌పీఎఫ్ మధ్య చోటుచేసుకున్న రాజకీయ సమీకరణాల్లో భాగంగా అత్యధిక ఫిరాయింపులు నమోదయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో 20 మంది ప్రజాప్రతినిధులు టీఎంసీని వీడి మరో పార్టీలో చేరినట్లు నివేదిక పేర్కొంది. తెలంగాణలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. గోవాలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ గూటికి చేరారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన నుంచి ఎన్నికైన పలువురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. మేఘాలయలో ఐదుగురు, అరుణాచల్‌ప్రదేశ్, గుజరాత్‌లో నలుగురు చొప్పున, మణిపూర్‌లో ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీలు మారారు. హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్‌లో ఇద్దరు చొప్పున, కర్ణాటక, మధ్యప్రదేశ్, సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కొక్కరు పార్టీ మారినట్లు ఏడీఆర్ పేర్కొంది. మూడు పార్టీల నుంచే 58 శాతం పార్టీలవారీగా ఎన్డీపీపీ నుంచి అత్యధికంగా 25 మంది బయటకు వెళ్లగా, టీఎంసీ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 19 మంది, బీఆర్ఎస్ నుంచి తొమ్మిది మంది పార్టీలు మారారు. ఆప్, ఎన్సీపీల నుంచి ఏడుగురు చొప్పున, శివసేన నుంచి ఆరుగురు, జేడీయూ నుంచి ఐదుగురు, ఎన్‌పీపీ నుంచి నలుగురు ఇతర పార్టీల్లో చేరారు. మొత్తం 111 ఫిరాయింపుల్లో ఎన్డీపీపీ, టీఎంసీ, కాంగ్రెస్ నుంచే 64 కేసులు నమోదయ్యాయని, ఇది సుమారు 58 శాతమని నివేదిక వెల్లడించింది. పార్టీ మారిన ప్రజాప్రతినిధులను చేర్చుకోవడంలో ఎన్‌పీఎఫ్ 32 మందితో ముందుండగా, బీజేపీలో 29 మంది చేరారు. మరో పార్టీలో 20 మంది చేరినట్లు నివేదిక పేర్కొంది. కాంగ్రెస్‌లో తొమ్మిది మంది, శివసేనలో ఎనిమిది మంది, ఎన్‌పీపీలో ఆరుగురు, అరుణాచల్ పీపుల్స్ పార్టీలో నలుగురు చేరారు. కొన్ని రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు, ప్రభుత్వాల మార్పునకు ఫిరాయింపులు కూడా కారణమయ్యాయని ఏడీఆర్ పేర్కొంది.



# పాము కాటేసినా ఏమీ కాని జంతువులివే

పాములు అనగానే దాదాపు ప్రతి ఒక్కరూ భయంతో వణికిపోతారు. అలా కాకుండా నిమ్మలంగా ఉండే వారి సంఖ్య తక్కువే. మరీ ముఖ్యంగా విషపూరిత పాములను చూస్తే నిశ్శబ్దంగా నిలబడిపోయే వారే ఎక్కువ. కానీ, కొన్ని జంతువులకు మాత్రం ఆ భయం ఉండదు. ఎందుకంటే... వాటిపై పాము విషం ఎటువంటి ప్రభావం చూపదు! అవును, పాముకాటేసినా కూడా ఏమాత్రం ప్రమాదం ఉండని కొన్ని జంతువులు ఉన్నాయి. అవి ఏనుగులాంటి భారీ జంతువులు కాదు చిన్న చిన్న జంతువులే. పాము కాటు వేస్తే భారీ ఆకారంతో ఉండే ఏనుగు కూడా కుప్పకూలుతుంది. మరి పాము కాటును కూడా చీమ కాటులా చూసే ఈ చిన్న జంతువులు ఏవి? వీటిపై పాము విషం ఎందుకు ప్రభావం చూపదు? రండి తెలుసుకుందాం.

పాము అనగానే ముందుగా గుర్తొచ్చేది ముంగీస. ఈ రెండిటిది జాతి వైరం. అందుకే పాము అనగానే ముంగీసను తలచుకోకుండా ఉండలేం. వీటి మధ్య శత్రుత్వం ఎంతంటే, ఎక్కడ చూసినా పోరాటమే. ఈ పోరులో ముంగీసను పాము కసితీరా కాటు వేసినా అది ప్రాణాంతకం కాదు. ఎందుకంటే ముంగీస శరీరంలో ఉన్న ప్రత్యేకమైన ప్రోటీన్లు పాము విషాన్ని విరగొట్టేస్తాయి. ఇంకో మాటలో చెప్పాలంటే న్యూట్రలైజ్ చేస్తాయి. ఇవి సహజ రోగనిరోధక శక్తిని కలిగించి విషానికి విరుగుడులా పనిచేస్తాయి. విషం ఒల్లంతా పాకగుండా అడ్డుకట్ట వేస్తాయి. అయితే ఎక్కువ సార్లు కాటుకు గురైతే ముంగీస ప్రాణాలపై ప్రమాదం ఉండొచ్చు.

## ఒపోసమ్

అమెరికాలో కనిపించే ఈ జంతువు శరీరంలో లేప్టిన్‌బైండింగ్ ప్రోటీన్ అనే ఒక స్పెషల్ ప్రోటీన్ ఉంటుంది. ఇది పాము విషంలో ఉన్న హానికరమైన టాక్సిన్లను నిర్వీర్యం చేస్తుంది. ముఖ్యంగా రాటిల్ స్నేక్ వంటి అత్యంత విషపూరిత పాము కాటు అయినా ఒపోసమ్‌కి పెద్దగా ప్రభావం ఉండదు. శాస్త్రవేత్తలు ఈ ప్రోటీన్‌ను తీసుకుని పాముకాటుకు ఔషధాల తయారీలో కూడా ప్రయోగాలు చేస్తున్నారు.



## అడవిపంది

అడవుల్లో స్వేచ్ఛగా తిరుగుతూ కనిపించే అడవి పందుల శరీర నిర్మాణం బలంగా ఉండటం వల్లే కాకుండా, వీటి శరీరంలో న్యూరోటాక్సిన్ రిసిస్టెంట్ రిసెప్టర్లు ఉండటం వల్ల కూడా ఇవి పాము విషాన్ని తట్టుకోగలవు. అదే కాదు, కొన్ని పరిశోధనల ప్రకారం వీటి రక్తంలో ఇన్ఫ్లమేటరీ ప్రోటీన్‌ల ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల, విషాన్ని ఆగిపెట్టే ప్రాథమిక చర్య చాలా వేగంగా జరుగుతుంది. అందువల్లే పాముల కాటు వీటికి పెద్దగా ముప్పుగా మారదు.

## హనీ బ్యాడ్జర్

ప్రపంచవ్యాప్తంగా భయమంటే తెలియని ప్రాణి ఏదైనా ఉందంటే అది ఇదే. ఎదురుగా ఏ జంతువు ఉన్నా లెక్కే చేయదు. ఇది ఆఫ్రికా, ఇండియా, సౌత్ ఆసియా ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ జీవి తన దూకుడుతో చాలా పాములను వేటాడుతుంది. ఎంతో విషపూరితమైన పాముల కాటుకూ ఇది భయపడదు. హనీ బ్యాడ్జర్ శరీరంలో ఓపియోసిడ్ రిసెప్టర్లు పాము విషానికి నిరోధకంగా ఉంటాయి. పాము కాటుకు గురైనప్పుడు కొన్ని నిమిషాలు అలసట, స్తబ్ధత వస్తాయి. ఇది పామును చంపి తినడం వలన కూడా దాని విషాన్ని సహించగలగడం శరీరానికి అలవాటయ్యే లక్షణంగా కూడా భావించవచ్చు.

## చెక్క ఎలుక



ఎలుకల్లో చాలా రకలా జాతులుంటాయి. వీటిలో చెక్క ఎలుక ఒకటి. ఈ చెక్క ఎలుక, ఇది పాము విషం ద్వారా ఏమాత్రం ప్రభావితం కాదు. కానీ పాములకు ఈ ఎలుకలు ఆహారమైపోతుంటాయి. పెద్ద పాములు వీటిని గుటకాయస్వాహా చేస్తుంటాయి. దీంతో ఈ ఇవి పాములకు ఆమడ దూరంలో ఉంటాయి. పాము అలికిడి వింటే తుర్రుమని పారిపోతాయి. బొరియాల్లో దాక్కుంటాయి.



# రోజూ ఈ పనులు చేస్తే.. లైఫ్ అంతా హ్యాపీ

మనం జీవితంలో ఎప్పుడూ కోరుకునేది ఏంటో చెప్పండి..? ఆనందంగా ఉండాలి.. ఆరోగ్యంగా ఉండాలి.. ఎక్కువ కాలం జీవించాలి.. ఆర్థికంగా స్థిరంగా ఉండాలి.. ఇవేగా! ఇలా మనం ఆనందంగా ఎక్కువ కాలం జీవించాలంటే తప్పకుండా ఐదు అలవాట్లను మన రోజు వారీ పనుల్లో భాగం చేసుకోవాలని అంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం.



## ఆరోగ్యకరమైన అల్పాహారం

ఉదయం లేచిన తర్వాత మన శరీరానికి అవసరమైన పోషకాలన్నీ ఉండేలా ఓ మంచి బ్రేక్ఫాస్ట్‌ని సిద్ధం చేసుకుని తినాలి. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మానేయొద్దని అధ్యయనాలు చెబుతున్నాయి. ఉదయం కాజు, బాదాం, పిస్తా, వాల్‌నట్స్, ఖర్జూరం లాంటి నట్‌స్‌తో పాటు ప్రొటీన్‌లు ఎక్కువగా ఉండే అల్పాహారాన్ని తప్పకుండా తీసుకోవాలి. అప్పుడు మన శరీరం శక్తివంతంగా ఉండి రోజు వారీ పనులను హుషారుగా చేయగలుగుతుంది.

## పాజిటివ్‌గా ఉండడం

ఇంటి నుంచి బయటలు దేరి సొసైటీలోకి వెళతాం కదా. అలా బయటకు వెళ్లిన తర్వాత మొదటిసారి మీరు కలుసుకున్న పరిచయస్తుడితో మీరు చాలా పాజిటివ్‌గా మంచి విషయాలను మాట్లాడేందుకు ప్రయత్నించండి. వారు మీ పొరుగింటి వారు కావొచ్చు. ఆఫీసులో మీ కొలీగ్ అయి ఉండొచ్చు. వారితో కొంత మంచి సంభాషణను చేయండి. దీని వల్ల ఆ పాజిటివ్ వైబ్స్ రోజంతా ఉంటాయి.

## వీలైతే ఓ కప్పు కాఫీ

ఉదయాన్నే ఓ కప్పు కాఫీ తాగడం వల్ల మనం ఆ రోజంతా రిలాక్సింగ్‌గా, ఆనందంగా ఉండొచ్చు. కాఫీ తాగడం వల్ల విసుగు, ఒత్తిడి, ఆందోళన తగ్గుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే రోజుకు ఒక కప్పుకు మించి దీన్ని తాగకూడదని గుర్తుంచుకోవాలి. ఇలా రోజును ప్రశాంతంగా మొదలు పెడితే ఆ రోజు మనం నిర్వర్తించాల్సిన బాధ్యతలన్నీ సక్రమంగా పూర్తవుతాయి.

చిన్న చిన్న వాటిలోనూ ఆనందాన్ని వెతుక్కోవడంరోజులో ఎదురయ్యే చిన్న చిన్న విషయాల్లోనూ ఆనందాన్ని వెతుక్కోండి. చల్లటి పిల్లగాలి వీస్తుందనో, సీతాకోక చిలుక రెక్కలను రెపరెప లాడిస్తూ అలా అలా ఎగురుతుందనో, చిన్న పిల్లాడు స్వచ్ఛంగా నవ్వుతున్నాడనో, మీ తోటలోని కొత్త మొక్క పూలు పూసిందనో.. ఇలా ప్రతి చిన్న విషయాన్నీ చెప్పలేనంత సంతోషంతో స్వీకరించండి. నమ్మండి మీ జీవితంలో అంతులేని ఆనందాలు.. రోజూ మిమ్మల్ని అబ్బురపరుస్తూనే ఉంటాయి.

## జీవిత లక్ష్యం

మన జీవిత లక్ష్యం ఏమిటి? అనే విషయంలో స్పష్టంగా ఉండాలి. ఉదయం లేచిన తర్వాత దాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకోండి. దాని కోసం ఆ రోజులో ఏమేం చేయాలో ప్రణాళిక వేసుకోండి. అంతా బాగానే జరుగుతుందని మనసుకు పదే పదే చెప్పుకుంటూ ఉండండి. అంతే. ఉదయం లేచిన తర్వత ఈ ఐదు పనులు తప్పకుండా చేసేందుకు చూడండి. శారీరకంగా, మానసికంగా మీరు చాలా ఉత్సాహంగా ఉంటారు. విజయాలను అందుకుంటారు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.